క్లుప్తంగా

పోర్టు ఆస్పత్రిని ప్రైవేటీకరించనివ్వం



పోర్టు ఆస్పత్రి ఎదుట ఆందోళన చేస్తున్న అఖిలపక్ష నాయకులు

తాటిచెట్లపాలెం : పోర్టు ఆస్పత్రిని ఎట్టి పరిస్థితుల్లోనూ కాపాడుకుని తీరుతామని కార్మిక సంఘాల నాయకులు పేర్కొన్నారు. ఆస్పత్రి ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా నిర్వహిస్తున్న నిరసన దీక్షలు 365 రోజులుగా కొనసాగుతున్నాయి. ఇందులో భాగంగా మంగళవారం ర్యాలీ, మానవహారం నిర్వహించారు. పోర్టు హాస్పిటల్ ప్రైవేటీకరణ టెండర్‌కు ఎవరూ ముందుకు రాలేదని, పోర్టు యాజమాన్యం వద్ద ఉన్న సొంత నిధులతోనే నిర్వహించాలని డిమాండ్ చేశారు. విశాఖ నగర అభివృద్ధికి పోర్టు ఎంతో కీలకమన్నారు. సుమారు 40 వేల మంది కార్మికుల ఆరోగ్యానికి సంబంధించిన సేవలను ప్రైవేటుకు అప్పగించడం దారుణమన్నారు. ఇప్పటికైనా ప్రైవేటీకరణ ఆలోచన విరమించుకోకుంటే కార్మికులు, ప్రజాసంఘాలు, రాజకీయ పార్టీలతో కలిసి పెద్ద ఎత్తున ఉద్యమించేందుకు సిద్ధంగా ఉన్నామని హెచ్చరించారు. ఐద్వా నాయకురాలు సుమిత్ర, రైతు సంఘం నాయకుడు నాయన బాబు పాల్గొని సంఘీభావం తెలిపారు. సీఐటీయూ నాయకులు కె.సత్యనారాయణ,జె.సత్యనారాయణ, గణేష్, శంకర్రావు, నర్సింగరావు, త్రినాథరావు, ఈశ్వరరావు, రాఘవులు పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి బాడీ బిల్డింగ్ పోటీలో కోన ప్రతిభ



బాడీ బిల్డింగ్ పోటీలో ప్రతిభ చాటిన కోన రమణ

డాబాగార్డెన్స్: విజయనగరం జిల్లాలో ఇటీవల నిర్వహించిన రాష్ట్ర స్థాయి బాడీ బిల్డింగ్ పోటీల్లో కోన రమణ 75 కేజీల విభాగంలో ఐదవ స్థానంలో నిలిచాడు. మాస్టర్స్ విభాగంలో కూడా రమణ మూడో స్థానంలో నిలిచి ప్రతిభ చాటాడు. ఇక లైట్ వెయిట్ విభాగంలో కోన మణిదీప్ తొలిసారిగా రాష్ట్ర స్థాయి బాడీ బిల్డింగ్ పోటీలో పాల్గొని సత్తా చాటాడు.

నేత్రపర్వం.. నిత్యకల్యాణం



నిత్యకల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహ స్వామి నిత్య కల్యాణాన్ని మంగళవారం ఉదయం 9.30 గంటల నుంచి వైభవంగా నిర్వహించారు. ఆలయ బేడా మండపంలో స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజ స్వామి, శ్రీదేవి, భూదేవిలను వేదికపై కొలువుదీర్చారు. విష్వక్సేన పూజ, పుణ్యాహవాచనం, కంకణధారణ, యజ్ఞోపవీతం, జీలకర్రబెల్లం, మాంగల్యధారణ, తలంబ్రాలు తదితర ఘట్టాలతో కల్యాణాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఉభయదాతలకు స్వామివారి శేషవస్త్రాలు, ప్రసాదం అందజేశారు.

సిమెంట్ ఫ్యాక్టరీకి వ్యతిరేకంగా పాదయాత్ర

పెదగంట్యాడ: అదానీ సిమెంట్ ఫ్యాక్టరీకి ప్రభుత్వం మంజూరు చేసిన అనుమతులను వెంటనే రద్దు చేయాలని సీపీఎం నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు సీపీఎం ఆధ్వర్యంలో రిక్షా కాలనీ, రామచంద్రనగర్, స్వతంత్రనగర్ తదితర ప్రాంతాల్లో మంగళవారం పాదయాత్ర నిర్వహించారు. సీపీఎం జోన్ కార్యదర్శి రాంబాబు మాట్లాడుతూ ఇప్పటికే ఈ ప్రాంత ప్రజలు గంగవరం పోర్టు కాలుష్యంతో పాటు డంపింగ్ యార్డ్ నుంచే వచ్చే దుర్వాసనతో అవస్థలు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పుడు సిమెంట్ ఫ్యాక్టరీ పెడితే మరిన్ని సమస్యలు ఉత్పన్నమయ్యే ప్రమాదం ఉందన్నారు. వెంటనే సిమెంట్ ఫ్యాక్టరీ అనుమతులు రద్దు చేయాలని లేనిపక్షంలో ఆందోళన ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో రమణ, వెంకట్రావు, త్రినాథస్వామి తదితరులు పాల్గొన్నారు.

లాంచీ ఎక్కేద్దాం.. సాగరదుర్గను దర్శిద్దాం



విశేష అలంకరణలో సాగరదుర్గ

- పెద్ద ఎత్తున తరలి వస్తున్న భక్తులు
- యారాడ కొండపై సముద్రమట్టానికి 125 మీటర్ల ఎత్తులో అమ్మవారి ఆలయం
- ప్రకృతి అందాలకు నెలవైన విశాఖలో కడలి తీరాన కొలువైన తల్లి
- మరో రెండు రోజులే అవకాశం

పిల్లలకు బోటు షికారంటే భలే సరదాగా ఉంటుంది. పెద్దలకేమో నవరాత్రుల్లో అమ్మవారి ఆలయానికి వెళ్లాలని ఉంటుంది. మరి ఆ రెండూ కలిసి వచ్చేలా ఓ ప్రయాణం ఉంటే బాగుంటుంది కదా. ఇదిగో ఆ రెండింటిని సాకారం చేస్తుంది యారాడ కొండపై సాగరదుర్గ దర్శనం. దసరా వేళ బోట్ షికారుకి అలా వెళ్లొచ్చేయండి మరి..



సాగరదుర్గ ఆలయానికి బోటు సౌకర్యం



సాగరదుర్గ ఆలయం

డాబాగార్డెన్స్: ప్రకృతి అందాలకు నెలవైన విశాఖలో కడలి తీరాన సాగర దుర్గ సన్నిధి దసరా శోభతో అలరారుతోంది. ఆలయ ప్రాశస్త్యం ఒక ఎత్తు కాగా.. ఎల్లరనూ కట్టిపడేసే ప్రకృతి సౌందర్యం మరో ఎత్తు.

ఏరియల్ వ్యూ పాయింట్ నుంచి ఓ వైపు పోర్టు అందాలు.. మరోవైపు నగరం.. ఇంకో వైపు యారాడ బీచ్ చూపు మరల్చనీయవు. అందం, ఆహ్లాదం, ఆధ్యాత్మికం కలగలుపుతో ఈ ప్రాంతం సందర్శకులకు సరికొత్త అనుభూతినిస్తోంది.

సాగరదుర్గ పేరు వచ్చిందిలా..

పోర్టు నిర్మాణ సమయంలో చేపట్టిన తవ్వకాల్లో కాంట్రాక్టర్‌కు శ్రీచక్రం లభ్యమయిందని, అమ్మవారు కలలో కనిపించి కొండపై ఆలయం నిర్మించమనడంతో 1969లో పోర్టు అధికారులు గుడి కట్టించారని చెబుతారు. సాగరంలో దొరికిన అమ్మవారు కావడంతో సాగరదుర్గగా ప్రసిద్ధిగాంచారు.

ఎక్కడ ఉంది..

యారాడ కొండపై సముద్రమట్టానికి 125 మీటర్ల ఎత్తులో ఉంది సాగరదుర్గ ఆలయం. నిత్యం ధూప దీప నైవేద్యాలతో కళకళలాడాల్సి ఉన్నా సరైన రవాణా సదుపాయం లేక కేవలం దసరా సమయంలో మాత్రమే భక్తుల సందర్శనకు అనువుగా ఉంటోంది. ఈ పది రోజులు ఆలయ నిర్వాహకులు బోటు సౌకర్యం ఏర్పాటు చేశారు.

నవరాత్రుల్లో ప్రత్యేక పూజలు..

నవరాత్రి ఉత్సవాల సందర్భంగా అమ్మవారు విశేష అలంకరణల్లో దర్శనమిస్తున్నారు. ఆలయం ఉదయం 4.30 గంటల నుంచి రాత్రి 8.30 గంటల వరకు తెరిచి ఉంటుంది. ఉదయం 4.30కు అమ్మవారికి పంచామృతాభిషేకాల అనంతరం మొదలైన పూజలు రాత్రి నక్షత్ర హారతితో ముగుస్తాయని ఆలయ ప్రతినిధి తెలిపారు.

ఎలా చేరుకోవాలి..

సాగరదుర్గ ఆలయానికి చేరేందుకు రెండు మార్గాలున్నాయి. ఒకటి షిప్‌యార్డ్ మీదుగా బస్సు సౌకర్యం కాగా.. రెండవది పోర్టు వేంకటేశ్వరస్వామి గుడి నుంచి బోటు మార్గం. అక్కడ వాహనాలు నిలిపివేసి బోటు ద్వారా అవతలి ఒడ్డుకు చేరుకోవాలి. బోటుకు రాను, పోను పెద్దలకు రూ.40, పిల్లలకు రూ.20 చార్జి చేస్తున్నారు. అక్కడి నుంచి గుడికి 2 కిలోమీటర్లు ఉంటుంది. అంత వరకు ఫ్రీ ఆటో సర్వీసులు నడుపుతున్నారు. మెట్ల మార్గం లోనూ గుడికి చేరుకోవచ్చు. ఉదయం 7 నుంచి సాయంత్రం 5 గంటల వరకు మాత్రమే బోటు సౌకర్యం కల్పించినట్టు బోటు యజమానులు తెలిపారు. మిగతా సమయాల్లో వెళ్లాలంటే షిప్‌యార్డు మీదుగా చుట్టూ 30 కిలోమీటర్లు తిరిగి వెళ్లాలి. అదీ ప్రైవేట్ వాహనాలు, సొంత వాహనాలు ఉంటేనే వీలవుతుంది.

బోట్ జర్నీ బాగుంది..



మా కుటుంబ సభ్యులు సాగరదుర్గ గుడి గురించి చెబితే ఆసక్తి కలిగింది. ఇప్పుడు ప్రత్యక్షంగా చూశాను. ఎంతో ఆహ్లాదకరంగా ఉంది. కుటుంబ సభ్యులతో కలిసి వచ్చి చూడటం ఇంకా బాగుంది. బోటులో ప్రయాణించడం మాకు మంచి అనుభూతినిచ్చింది. ఈ పరిసరాలు ఎంతో ఆహ్లాదంగా ఉన్నాయి. మర్చిపోలేని ప్రయాణం ఇది.

– శ్రీజ, ఎంవీపీ కాలనీ

చక్కటి వాతావరణం..



ఆహ్లాదకరంగా ఉన్న ఈ ప్రాంతం మరువలేనిది. ప్రశాంత వాతావరణంలో తల్లి దర్శన భాగ్యం కలిగింది. అమ్మ దర్శనం కోసం ఎస్. కోట నుంచి బస్సు మీద వైజాగ్ వచ్చాను. అక్కడి నుంచి పాతపోస్టాఫీస్ వరకు ఆర్టీసీలో వచ్చి ఆటోపై వేంకటేశ్వరస్వామి ఆలయం వరకు వచ్చాను. ఈ ప్రయాణమంతా ఒక ఎత్తు. ఇక్కడి నుంచి బోటుపై అమ్మ దర్శనానికి వెళ్లడం మరో ఎత్తు.

– గ్రద్దె రమాదేవి, ఎస్.కోట, విజయనగరం జిల్లా

ఏటా వస్తుంటాం..



సాగరదుర్గ గుడి పరిసర ప్రాంతాలు ప్రశాంతంగా ఉంటాయి. అమ్మవారిని దర్శించుకునేందుకు నవరాత్రుల్లోనే వీలవుతుంది. దీంతో ప్రతి సంవత్సరం పిల్లలతో కలిసి వస్తుంటాం. బోటుపై వెళ్లేందుకు పిల్లలు చాలా సరదా పడతుంటారు. ఈ ప్రయాణం.. అమ్మవారి దర్శనం మరపురాని అనుభూతి అని చెప్పాలి.

– వర్రి వరలక్ష్మి, మహారాణిపేట

ఇదే తొలిసారి..



నేను విశాఖపట్నం వచ్చి దాదాపు 20 ఏళ్లయింది. ఇంత వరకు ఇలా బోటు మీద సాగరదుర్గ కొండ (యారాడకొండ)కు దారి ఉన్నట్టు నాకు తెలియదు. ఓ వైపు బోటు షికారు.. మరోవైపు సాగర దుర్గమ్మ దర్శనం ఎంతో అనుభూతినిచ్చింది. ఈ పరిసరాలు, ఈ ప్రయాణం మరిచిపోలేనిది. ఇక్కడికి రావడం చాలా ఆనందంగా ఉంది.

– నాగమణి, ప్రైవేట్ ఉద్యోగి

అమ్మను చూశాం..



నవరాత్రుల్లో అమ్మ దర్శనం కలిగింది. చాలా సంతోషం. నిత్యం ఒత్తిడితో ఉన్న మాలాంటి వారికి బోటు షికారు ద్వారా కొంత ఉపశమనం లభించింది. సముద్రంపై బోటు ప్రయాణం ఆహ్లాదాన్నిచ్చింది. ఆలయ పరిసరాలు ఎంతో ప్రశాంతంగా ఉన్నాయి.

– సీహెచ్ రాజేశ్వరి, ఆంథోనీనగర్

ఘనంగా బాబా ఆలయ వార్షికోత్సవం

తాటిచెట్లపాలెం: రైల్వే న్యూకాలనీలో గల షిర్డీ సాయి బాబా ధ్యాన మందిరంలో 31వ వార్షికోత్సవం, దసరా వేడుకలు ఘనంగా ప్రారంభమయ్యాయి. మంగళవారం నుండి మూడురోజుల పాటు ఈ ఉత్సవాలు జరగనున్నాయి. మంగళవారం దాసరి శ్రీరామమూర్తి దంపతులచే కుంజర మహాగణపతి, శ్రీ శారదామాత అమ్మవారికి, శ్రీ నాగ సుబ్రహ్మణ్యేశ్వరస్వామి వారికి జలాభిషేకం, పంచామృతాభిషేకాలు నిర్వహించారు. మహోత్సవాల్లో భాగంగా కుంకుమపూజలు, సహస్ర నామార్చన, భక్తుల స్వహస్తాలతో క్షీరాభిషేకం, రుద్రాక్షల అభిషేకం, వస్త్రాలంకరణ, పల్లకీసేవ, బాబా వారి గీతాలాపన (భజన), పుణ్యాహవచనం, నవగ్రహారాధాన, పంచగవ్యం, వాస్తుపూజ, సాయినాథ హోమం వంటి కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు ఆలయ వ్యవస్థాపక అధ్యక్షుడు నూకల శేషగిరిరావు తెలిపారు. దసరా పర్వదినం, ఆలయ వార్షికోత్సవం సందర్భంగా ఉదయం నుండి ప్రత్యేక పూజలు, మధ్యాహ్నం మహాన్నదానం, భక్తుల స్వహస్తాలతో దీపారాధన జరుగుతాయని, కాశీ హరిద్వార్ నుండి తీసుకొచ్చిన పంచముఖి రుద్రాక్షలను బాబాకు అభిషేకించిన తర్వాత భక్తులకు ఉచితంగా అందజేస్తామని తెలిపారు. వీటితో పాటు కంకణాలు, సాయిబాబా ఫొటో, షిర్డీ నుండి తీసుకొచ్చిన విభూతి భక్తులకు అందించనున్నట్లు తెలిపారు.



నాగసుబ్రహ్మణ్యేశ్వర స్వామికి పూజలు చేస్తున్న భక్తులు, కమిటీ సభ్యులు

ఇస్కాన్‌లో రావణ దహనం రేపు

కొమ్మాది: దసరా వేడుకల్లో భాగంగా సాగర్‌నగర్ ఇస్కాన్ టెంపుల్‌లో గురువారం రాత్రి 7 గంటలకు రావణ దహనం నిర్వహించనున్నట్లు ఇస్కాన్ అధ్యక్షుడు సాంబదాస్ ప్రభూజీ ఒక ప్రకటనలో తెలిపారు. 50 అడుగుల రావణుడి భారీ దిష్టిబొమ్మను దహనం చేసిన అనంతరం ప్రత్యేకమైన ఫైర్ క్రాకర్స్‌షో, సాంస్కృతిక కార్యక్రమాలు, రామలీలలపై ప్రవచనాలు ఉంటాయని తెలియజేశారు. ఆ రోజు ముందుగా మందిరంలో రాధాకృష్ణులను, జగన్నాథ, సుభద్ర, బలభద్రులను వివిధ వర్ణాల పుష్పాలతో అలంకరించి ప్రత్యేక పూజలు చేస్తామని పేర్కొన్నారు.

మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణ ఆపాలి

- రోడ్డుపై బైఠాయించి నిరసన తెలిపిన వైఎస్సార్‌సీపీ శ్రేణులు



రోడ్డుపై బైఠాయించి నినదిస్తున్న మాజీ ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్, నాయకులు

డాబాగార్డెన్స్: పేద విద్యార్థులు కూడా డాక్టర్లు కావాలన్న జగన్‌మోహన్‌రెడ్డి ఆశయానికి తూట్లు పొడవాలని చంద్రబాబు దుర్బుద్ధితోనే మెడికల్ కళాశాలలను ప్రైవేటీకరించాలని నిర్ణయించుకున్నారని మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త వాసుపల్లి గణేష్‌కుమార్ మండిపడ్డారు. పార్టీ జిల్లా ఎస్సీ సెల్ ఆధ్వర్యంలో డాబాగార్డెన్స్ అంబేడ్కర్ విగ్రహం వద్ద చేపట్టిన నిరసన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. పార్టీ శ్రేణులతో కలిసి పెద్ద ఎత్తున రోడ్డుపై బైఠాయించి కూటమి ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినదించారు. మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తూ, దళితులకు ఇచ్చిన ఎన్నికల హామీలు, వారిపై జరుగుతున్న దాడులను ఖండిస్తూ ఆందోళన చేపట్టారు. అలాగే విజయవాడలోని అంబేద్కర్ స్మృతివనాన్ని ప్రైవేట్ వ్యక్తులకు కట్టబెట్టే ప్రయత్నాన్ని ఆపాలంటూ వాసుపల్లి డిమాండ్ చేశారు. లేనిచో పెద్ద ఎత్తున పోరాటానికి సిద్ధమని హెచ్చరించారు. కార్యక్రమంలో స్టేట్ క్రిస్టియన్ మైనార్టీ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు బొల్లవరపు జాన్‌వెస్లీ, అధికార ప్రతినిధి కొండా రాజీవ్‌గాంధీ, జిల్లా అధికార ప్రతినిధి దొడ్డి రామానంద్, జిల్లా కార్యదర్శులు పద్మనాభం అమ్మాజీ, అభిరెడ్డి ఆదివిష్ణు, బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు సనపల రవీంద్రభరత్, పార్టీ నాయకులు వడ్డాది దిలీప్, కనకల ఈశ్వర్, సలాది భవానీ, దళమంతుల చిన్ని, ఈతలపాక విజయ్, సాగర్, మాజీ కార్పొరేటర్ పచ్చిరపల్లి రాము, వార్డు అధ్యక్షులు సర్వేశ్వరరెడ్డి, పీతల వాసు, దళమంతుల మాణిక్యాలరావు, దొడ్డి బాపూ ఆనంద్, రాజారెడ్డి, ముత్తాబత్తుల రమేష్, లింగం శ్రీను, అలపన కనక రెడ్డి, మహ్మద్ షకీల్, గంగళ రామరాజు, గురజాపు రవి, ముజీబ్‌ఖాన్, భీశెట్టి ప్రసాద్, అనుబంధ సంఘాల నాయకులు కోన శంకర్, ఆరుగుల రాజ్‌కుమార్, గరికిన వెంకటేష్, గుంటు ఆనంద్, సువార్త రాజు, జీరు సూర్యనారాయణ, కోట ఆనంద్, బొండాడ వెంకటరమణ, వాసుపల్లి బంగారమ్మ, తాడి రవితేజ, మళ్ల విజయ్, రాజాపాత్రుడు, సూర్యనాయుడు, మైనార్టీ నాయకుడు బాబ్జి, బెవర మహేష్, పడాల సూర్యకుమార్, వర్రి నాగ అరుణ్ కుమార్, కొణతాల కృష్ణవేణి, కంచిబోయిన కిషోర్, రామలక్ష్మి, రోజా రమణి, లండా రమణ, కోరాడ సురేష్, చోడిపిల్లి శివ, చేపల ప్రసాద్, లండ త్రినాథ్, రూప, సతీష్, రాము, హేమ తదితరులు పాల్గొన్నారు.

మహిషాసుర మర్దినిగా దుర్గమ్మ



శివరామకృష్ణ దేవస్థానంలో దుర్గమ్మగా ఉమాదేవి



మహిషాసుర మర్దినిగా సాగర గిరి కనక దుర్గమ్మ



మహారాణిపేట దుర్గాదేవి



ధనశక్తి పీఠంలో అమ్మవారికి సమర్పించిన సారె

అల్లిపురం: అమ్మలగన్న అమ్మ దుర్గమ్మ శరన్నవరాత్రుల సందర్భంగా మహిషాసుర మర్దినిగా మంగళవారం భక్తులకు దర్శనమిచ్చారు. శివరామకృష్ణ దేవస్థానంలో ఉమాదేవి అమ్మవారు దుర్గాదేవిగా దర్శనమిచ్చారు. సాగర గిరి కనకదుర్గమ్మను మహిషాసుర మర్దినిగా అలంకరించారు. ఈ సందర్భంగా భక్తులు అమ్మవారిని దర్శించుకుని పూజలు చేశారు. ఆయా చోట్ల భక్తులకు ప్రసాద వితరణ గావించారు.

దుర్గమ్మకు సారెసమర్పణ..

మెయిన్‌రోడ్డులోని శ్రీ ధనశక్తి పీఠంలో వెలసిన దుర్గమ్మకు భక్తులు మంగళవారం సాయంత్రం సారె సమర్పించారు. అల్లిపురంతో పాటు పలు ప్రాంతాల నుంచి భక్తులు పసుపు కుంకమలు, చీర, పూలు, రకరకాల పిండి వంటలతో అల్లిపురం మెయిన్‌రోడ్డు, మార్కెట్ రోడ్డు, నేరెళ్లకోనేరు తదితర ప్రాంతాల మీదుగా అమ్మవారి ఆలయానికి చేరుకున్నారు. అక్కడ అమ్మవారి చెంతకొచ్చి వాటిని నివేదించారు.



అల్లిపురంలో తిరువీధి నిర్వహిస్తున్న భక్తులు

మహారాణిపేట దుర్గాదేవికి విశేష పూజలు..

మహారాణిపేట: మహారాణిపేటలో వేంచేసిన దుర్గాదేవి అమ్మవారిని బీజేపీ వైద్య విభాగం కన్వీనర్ రూపాకుల రవికుమార్ మంగళవారం దర్శించుకుని పూజలు చేశారు. నిర్వాహకులు పల్ల చలపతి, పల్లా లక్ష్మి దంపతులు, ఎస్. సాయి పూజిత, పల్లా సుజాత, వనిత, శశికళ తదితరులు అమ్మవారికి పూజలు చేశారు.

4న మెలోడీ క్రియేటర్స్ రజతోత్సవం

డాబాగార్డెన్స్: మెలోడీ క్రియేటర్స్ రజతోత్సవ వేడుకలు ఈ నెల 4న నిర్వహించనున్నారు. డాబాగార్డెన్స్ అల్లూరి విజ్ఞాన కేంద్రం వేదికగా నిర్వహించనున్న వేడుకలకు సంబంధించి మంగళవారం సెంచూరియన్ విశ్వ విద్యాలయం గౌరవ చాన్స్‌లర్ ఆచార్య జీఎస్ఎన్ రాజుకు ఆహ్వాన పత్రిక అందించి, ఆయన చేతుల మీదుగా పోస్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా నిర్వాహకులు మాట్లాడుతూ విశాఖ నగరానికి చెందిన పలువురు ప్రముఖులు పాల్గొంటున్నట్టు చెప్పారు. కళాభిమానులు, సంగీతప్రియులు, సాంస్కృతిక సంస్థల అధినేతలు పాల్గొని మెలోడి క్రియేటర్స్ రజతోత్సవం విజయవంతం చేయాలని కోరారు. అలాగే సంస్థ 25వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని సాంస్కృతిక వైభవం ప్రత్యేక సంచిక ఆవిష్కరణ, నటరత్న, యువరత్న పేరిట సినీ సంగీత విభావరి నిర్వహించనున్నట్టు చెప్పారు. కార్యక్రమంలో సంస్థ అధ్యక్షుడు సీహెచ్ సత్యనారాయణ, కార్యదర్శి, ఆధ్యాత్మికవేత్త ఎంవీ రాజశేఖర్, కొణతాల రాజు, వి.ప్రభాకర్, మేడా మస్తాన్‌రెడ్డి, అరుణకాంత్, ప్రసాద్ పాల్గొన్నారు.



పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఆచార్య జీఎస్ఎన్ రాజు, నిర్వాహకులు

గిరిజనులకు అప్పన్న చిత్రపటాల అందజేత



గిరిజనులకు అప్పన్న చిత్రపటాలు అందజేస్తున్న సురేంద్రస్వామి

సింహాచలం: అల్లూరి సీతారామరాజుజిల్లా ముంచంగిపుట్టు మండలం జర్జుల పంచాయతీలోని తమ్మేగుల, అమ్లకూడ, శరబంద గుర్రాబయలు గ్రామాల్లో సింహాచలానికి చెందిన సింహాద్రిమఠం ఆధ్వర్యంలో మంగళవారం హిందూ ధర్మ ప్రచారం చేశారు. సింహాద్రి మఠం నిర్వాహకుడు, శ్రీనృసింహ దీక్ష గురుస్వామి కశిరెడ్డి సురేంద్రస్వామి హిందూ ధర్మ విశిష్టతను, గొప్పతనాన్ని గిరిజనులకు తెలియజేశారు. శ్రీనృసింహ దీక్ష విశిష్టతని గిరిజనులకు చాటిచెప్పారు. 128 గిరిజన కుటుంబాలకు శ్రీనృసింహస్వామి చిత్రపటాలు, తువ్వాళ్లు అందజేశారు. ఈ కార్యక్రమంలో పెద్ద ఎత్తున గిరిజనులు పాల్గొన్నారు.

దుర్గమ్మను దర్శించుకున్న సీపీ బాగ్చి

మల్కాపురం: దుర్గాష్టమి పర్వదినాన్ని పురస్కరించుకుని మల్కాపురం పోలీస్‌స్టేషన్ పరిధిలోని జవహర్‌నగర్‌లో విశాఖ వెస్ట్ కల్చరల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో బెంగాలీలు నిర్వహిస్తున్న దసరా వేడుకల్లో పోలీస్ కమిషనర్ శంఖబ్రతబాగ్చి కుటుంబ సమేతంగా పాల్గొని ప్రత్యేక పూజలు జరిపారు. ఈ సందర్భంగా సీపీ బాగ్చి మాట్లాడుతూ విశాఖ నగరంలో ప్రశాంత వాతావరణంలో విజయదశమి వేడుకలు జరిగేలా చర్యలు చేపడుతున్నామన్నారు. నగరంలో క్రైం రేటు తగ్గుముఖం పట్టేలా రాత్రి పూట నిఘా మరింత పటిష్టం చేస్తున్నామని తెలిపారు. పండగకి ఊరు వెళ్లే వారు జాగ్రత్తగా ఇళ్లకు తాళాలు వేసి, స్వీయరక్షణ కోసం ఇళ్లలో సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకోవాలని కోరారు. చోరీలను నియంత్రించేందుకు నిరంతరం పెట్రోలింగ్ నిర్వహించడం జరుగుతుందన్నారు. దుర్గామాత ఆశీస్సులు ఉంటే విజయం సిద్ధిస్తుందని, ప్రజలంతా సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని అమ్మవారిని ప్రార్థించినట్లు తెలిపారు.



దుర్గాదేవికి కుటుంబ సమేతంగా పూజలు చేస్తున్న సీపీ శంఖబ్రత బాగ్చి

విద్యార్థులకు ముగిసిన టైలరింగ్ శిక్షణ

గాజువాక: సమగ్ర శిక్ష ఆధ్వర్యంలో గాజువాక జిల్లా పరిషత్ హైస్కూల్ విద్యార్థులకు నిర్వహించిన కుట్టు శిక్షణ తరగతులు మంగళవారం ముగిశాయి. ఒకేషనల్ విభాగం ఆధ్వర్యంలో సెప్టెంబర్ 21న ప్రారంభమైన ఈ శిక్షణ కార్యక్రమం పదిరోజుల పాటు సాగింది. 31 మంది విద్యార్థులు తర్ఫీదు పొందారని హైస్కూల్ ప్రధానోపాధ్యాయురాలు విజయ ప్రశాంతి తెలిపారు. భవిష్యత్‌లో ఉపాధి అవకాశాలకు ఈ శిక్షణ దోహదం చేస్తుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఒకేషనల్ ఉపాధ్యాయురాలు భారతి, కో ఆర్డినేటర్ మెట్ట సుధాకర్ భట్లు, జీసీడీవో గుమ్మడి శ్రీదేవి తదితరులు పాల్గొన్నారు.